

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-రాజంపేట

మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి చేయూతనివ్వేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని, మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాజంపేట సహాయ మత్స్య పర్యవేక్షకులు మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు 45.50 లక్షల చేప పిల్లలను నీటిలో వదలామన్నారు. ఈనెల 11వ తేదీన బహుదా మత్స్య క్షేత్రం నుండి 9.50 లక్షల చేప పిల్లలను, పీలేరు మత్స్య క్షేత్రం నుండి 1.50 లక్షల చేప పిల్లలను వదలామని తెలిపారు. 12వ తేదీన తిరుపతి జిల్లాలోని కళ్యాణి డాం మత్స్య క్షేత్రం నుండి 11.50 లక్షల చేప పిల్లలను,16వ తేదీన తిరుపతి మత్స్య క్షేత్రం నుండి 5.70 లక్షల చేప పిల్లలను వదలామన్నారు. 17వ తేదీన చిత్తూరు జిల్లాలోని కృష్ణాపురం మత్స్య క్షేత్రం నుండి 8.20 లక్షల చేప పిల్లలను, 18వ తేదీన పలమనేరు మత్స్య క్షేత్రం నుండి 9.10 లక్షల చేప పిల్లలను వదలామన్నారు. నందలూరు మండలం కోనాపురం గ్రామ పంచాయతీలో ఉన్న సోమశిల వెనుక జలాలలో సీడ్ స్టాకింగ్ కమిటీ సభ్యులు, గ్రామ మత్స్య కారులు పాల్గొని చేప పిల్లలను వదలామని పేర్కొన్నారు.

'ఉపాధి' సవరణలను ఉపసంహరించుకోవాలి

- విబి-జిఆర్ఎఎంజి బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలో నాయకులు
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ



మదనపల్లె : గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం సవరణలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం సాగిస్తామని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. ఈ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను రద్దు చేయాలన్నారు. చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మౌలిక స్వభావాన్ని కేంద్ర ప్రభుత్వం మారుస్తోందన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జిఆర్ఎఎంజి) పేరుతో ఉపాధి హామీ పథకానికి "రాంరాం" పలకనుందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పని హక్కుగా ఉన్న పాతచట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. సాధారణ పథకంగా దీనిని మార్చిస్తే, ఈ పథకం కొనసాగివచ్చు లేదా రద్దు చేయవచ్చని పేర్కొన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ కార్మికుల డిమాండ్ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చేసి అవసరాన్ని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. కొత్త పథకంలో పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. వ్యవసాయ పనులు రద్దీగా ఉండే సమయాల్లో 60 రోజుల ఉపాధిని నిలుపుదల చేయడం వల్ల అత్యంత అవసరమైన సమయాల్లో గ్రామీణ కార్మికులకు పని నిరాకరించబడుతోందని వివరించారు. తద్వారా వారిని కొద్దిమందిగా ఉండే భూస్వాములపై ఆధారపడేలా చేయడం గర్హనీయమన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎగా ఉన్న ఈ పథకం పేరును మార్చడం మహాత్ముడిని అవమానించడమేనన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని చెప్పారు. అంతేకాకుండా మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని వివరించారు. ఈ పథకం అమలుకు ఇప్పటివరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారని తెలిపారు. కొత్త పథకం ప్రకారం ఖర్చును ముందుగా రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత కేంద్రం తిరిగి ఆ సొమ్మును రాష్ట్రాలకు చెల్లిస్తామని చెబుతుందన్నారు. గ్రామీణులకు మేలు చేసే పథకం పేరులో గాంధీ పేరుని తొలగించడం మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్రెడ్డి, సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ, ఆటో యూనియన్ నాయకులు శ్రీరాములు, ఐద్వా జిల్లా కన్వీనర్ జి.కృష్ణమూర్తి, నాయకులు మోహన్రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి విబి-జిఆర్ఎఎంజి పేరు పెట్టడం ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. స్థానిక అంబేద్కర్ చిత్రపటం వద్ద బిజెపి తీరును ఖండిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సుధీర్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కోట్లాది మందికి ఉపాధి కల్పించే చట్టాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు లాభాల కోసం పని చేయడం సిగ్గుచేటన్నారు. ఒక వైపు పరిశ్రమలు మూసివేసి మరోవైపు వ్యవసాయం దివాళా తీస్తుంటే గ్రామీణ ప్రాంతాల్లో కొద్దిమేరకు ప్రజల అవసరాలకు తిండికి ఆసరాగా ఉన్న పని లేకుండా చేసి ఆకలి కేకలు కారణమయ్యే బిజెపికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. పట్టణ ప్రాంతాలకు చట్టాన్ని వర్తింప చేసి 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డిసుధాకర్, కాంగ్రెస్ నాయకులు చెన్నకృష్ణ, రజక సంఘం నాయకులు రమేష్, శ్రీనివాసులు, పామయ్య, మాధవయ్య, మోహన్ పాల్గొన్నారు. **చిట్వేలు:** స్థానిక ఎంపిడిఒ ఆఫీస్ వద్ద సిఐటియు, వ్య.కా.స, ఎఐకెఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, వ్య.కా.స జిల్లా కార్యదర్శి, పందికాళ్ళ మణి, నాయకులు సుజాత, ఆనందయ్య, శంకరమ్మ, ఒలిమి నాగయ్య, నారాయణ, వ అంబోరి సుజాతమ్మ, నర్సింహులు పాల్గొన్నారు.



రాయచోటి : అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఉపయోగంలోలేని అకౌంట్లపై చర్యలు చేపట్టండి

- జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి 10 సంవత్సరాల పైబడి క్లెయిమ్ చేయని బ్యాంకు అకౌంట్లోని నగదును జిల్లా పరిపాలనకు వినియోగించుకునేలా కలెక్టర్ అకౌంట్లోకి బదిలీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని వివిధ శాఖల జిల్లా అధికారులను, వివిధ బ్యాంకుల ప్రతినిధులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించి 10 సంవత్సరాల పైబడి క్లైమ్ చేయని బ్యాంక్ అకౌంట్లపై జెసి ఆదర్శ రాజేంద్రన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి పేర్కొన్న విధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించి 10 సంవత్సరాల పైబడి ఉపయోగంలో లేని బ్యాంక్ అకౌంట్లోనే నగదును వెంటనే కలెక్టర్ పరిపాలనకు సంబంధించిన అకౌంట్లోకి బదిలీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మొదటగా జిల్లాకు సంబంధించి 100 అకౌంటులను గుర్తించి బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. అనంతరం మిగిలిన అకౌంట్లకు సంబంధించి బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అకౌంట్లను వినియోగించుకోకపోతే ఆర్బిఐ నగదును డిపాజిటర్ల అవగాహన, విద్యకు వినియోగించుకుంటారని జిల్లా పరిపాలనకు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

- పట్టణంలో ప్రజలు, విద్యార్థుల భారీ ర్యాలీ



ర్యాలీగా తరలి వెళుతున్న వేలాదిమంది ప్రజలు, విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లా సాధన కోసం శుక్రవారం జెఎసి ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజా గర్జన కార్యక్రమంతో పట్టణం అట్టుడికి పోయింది. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని మండ లాలకు నుంచి వేలాదిమందిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడంతో పట్టణం జన సంద్రమైంది. మరోవైపు ప్రయివేట్ పాఠశాలల యూనియన్ అపుస్మా అధ్యక్షులు అబ్బూరి ప్రభాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేశ్వ ర్రెడ్డి ఆధ్వర్యంలో పలు విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సమీపంలోని ప్రజాగర్జన వేదిక వద్దకు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి చమర్తి జగన్మోహన్రాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, జనసేన పార్లమెంట్ ఇన్ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు, పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ చేరుకొని రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటూ నినాదాలు చేశారు. పాత బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లిన నాయకులు సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావనకు వినతి పత్రం అందజేశారు. **రైల్వేకోడూరు:** పట్టణంలో జెఎసి ఆధ్వర్యంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్తో కొనసాగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వినూత్నంగా తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా నిలబడి నిరసనకు సంఘీభావం ప్రకటించారు. పిరమిడ్ ఆకారంలో నిలబడి జాతీయ జెండాను పట్టుకొని దేశభక్తిని చాటారు. సంగీతమ్, అనంతరం కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వినూత్న వేషధారణలో పాల్గొనడం అందరినీ ఆకట్టు కుంది. వెంకటేశ్వర స్వామి, అమ్మవార్ల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజంపేట జిల్లా సాధన కోసం జరుగుతున్న ఈ నిరసన కార్యక్రమంలో తమ వంతు మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విద్యార్థులతో కలిసి మానవహారంగా ముందుకు నడిచారు. కార్యక్రమంలో పలు విద్యా సంస్థలకు చెందిన ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్స్ ముత్యాల పెంచలయ్య, ఎస్ఎన్.శ్రీనివాసులు, చంగల్ రాజు, నరసింహరెడ్డి, ఎంవి. కుమార్, డాక్టర్ ప్రదీప్, మదన్, చంగల్రాజు, ఓబులవారిపల్లి, చిట్వేలి మండలంలోని పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరసనలో పాల్గొన్నారు.



సిఐకి ఫిర్యాదు చేస్తున్న కాట్లాటపల్లి గ్రామస్తులు

చిన్నారిపై లైంగిక దాడి యత్నం

- పోలీసులకు గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అభం, శుభం తెలియని 8 ఏళ్ల చిన్నారిపై ఓ యువ కుడు అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు..మండలంలోని వలసపల్లె పంచాయతీ కట్లాటపల్లెకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారికి తల్లిదండ్రులు లేరు. అవ్వ చెంతనే ఉంటోంది. అవ్వే కూలి పనులు చేసుకుంటూ పాపను పోషించుకుంటూ చదివించుకుంటోంది. ఈ క్రమంలో పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన చిన్నారిని స్థానికంగా ఉన్న వరుణ్ అనే యువకుడు మాయమాటలు చెప్పి చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి, నోటికి గుడ్డకుక్కి అత్యాచారయత్నం చేస్తుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. వరుణ్ అక్కడి నుంచి పరారయ్యాడు. కూలి పనుల్లో ఉన్న అవ్వకు విషయం తెలియగానే పరుగుపరుగున ఇంటికి చేరుకుంది. చిన్నారి అవ్వ వెంటనే గ్రామస్తులతో కలిసి మదనపల్లె తాలూకా పోలీసుస్టేషన్ చేరుకుని ఫిర్యాదు చేసింది. తల్లిదండ్రులు లేని చిన్నారిపై అఘత్యానికి పాల్పడిన యువకున్ని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. విచారించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేస్తామని సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

'పది' పరీక్ష ఫీజుకు మరో అవకాశం : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి : 10వ తరగతి పరీక్ష ఫీజుల చెల్లింపునకు 20వ తేదీ వరకు మరో అవకాశం కల్పించినట్లు డిఇఒ సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రూ.500 అపరాధ రుసుంతో హెచ్ఎం లాగిన్ ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. తక్కువ వయసు ఉన్న విద్యార్థులు వయసు మినహాయింపు ఫీజును బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్సైట్లో చెల్లించవచ్చని తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు కూడా అదే వెబ్సైట్ ద్వారా ఫీజులు చెల్లించవచ్చన్నారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా త్వరగా ఫీజులు చెల్లించాలని ప్రధానోపాధ్యాయు లకు సూచించారు.

'సుగవాసి'ని కలిసిన డివిఎంసి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులుగా కొత్తగా ఎన్నికైన సుగవాసి ప్రసాద్ బాబుని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బండ కింద మనోహర్, సత్యాల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం వారు రాయచోటిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డివిఎంసి సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సుగవాసి ప్రసాద్ బాబును కోరారు. స్పందించిన సుగవాసి మాట్లాడుతూ త్వరలో జిల్లా పర్యటనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ సమస్యలను గుర్తించి పరిష్కార మార్గం చూపుతానని ప్రసాద్ బాబు తెలిపారని పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు విశ్వనాథ ఆచారి పాల్గొన్నారు.



ప్రసాద్ బాబును సన్మానిస్తున్న డివిఎంసి సభ్యులు

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

- డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య

ప్రజాశక్తి -రాయచోటి అర్బన్

ఈ నెల 21వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఉషశ్రీ పిలుపునిచ్చారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో వైద్యులు సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం రోజున అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల్లో పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలంటూ కోరారు. 21వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా, మండల స్థాయిలో టాస్క్ఫోర్స్ సమావేశాలు ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్లు, ఎంఎల్హెచ్సికు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం 21 నుండి 23వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆదివారం రోజున అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాలలో పిల్లలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో చుక్కలు వేయనున్నారన్నారు. 22, 23వ తేదీలలో ఆశ, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అప్పటి వరకు చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి చుక్కలను వేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 18,07,501 జనాభాకు గాను ఐదు సంవత్సరాల పిల్లలు 1,78,150 మందిని గుర్తించామన్నారు. పోలియో చుక్కలు వేయ డానికి జిల్లా వ్యాప్తంగా 1615 బూత్లు 161 రూట్లు 54 మొబైల్ టీమ్లను ఏర్పాటు చేయ డం జరిగిందన్నారు. పోలియో చుక్కల నిర్వ హణ కార్యక్రమంలో మొత్తం 662 మంది సిబ్బంది పాల్గొంటారన్నారు. తల్లిదండ్రులు, ప్రజాప్రతి నిధులు, మత పెద్దలు, స్వఛ్ఛంద సేవా సంస్థలు తదితరులు పల్స్ పోలియో కార్యక్రమానికి సహకరించి 100 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా చూడాలన్నారు. తద్వారా పోలియో వ్యాధి లేని భారత దేశం ఏర్పాటులో భాగస్వామ్యం కావాలని కోరారు.

అంగన్వాడీ వ్యవస్థ మరింత బలోపేతం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

కూటమి ప్రభుత్వంలో అంగన్వాడీ వ్యవస్థ మరింత బలోపేతం కానుందని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా సేవలందించేందుకు ఎన్డిఎ కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్లు అందిస్తున్నామని తెలియజేశారు. శుక్రవారం రాజంపేట పట్టణ పరిధిలోని ఐసిడిఎస్ కార్యాలయంలో రాజంపేట, నందలూరు మండలాలకు చెందిన ఆశా వర్కర్లకు 5జి మొబైల్ ఫోన్లను చమర్తి జగన్ మోహన్రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన 4జి మొబైల్ ఫోన్ లు సరిగ్గా పనిచేయలేదని, అందుకే కూటమి ప్రభుత్వంలో 5జి నెట్వర్క్తో మొబైల్ ఫోన్లు అందజేశామన్నారు. అంగన్వాడీలు సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి, నియోజకవర్గానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, సిడిపిఒ నాగలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎ.ఎస్.యువరాజ్, ప్రాజెక్టు ఇన్స్పెక్టర్ రమేష్, సూపర్వైజర్లు రానెమ్మ, నాగరత్నమ్మ, రాజంపేట, నందలూరు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మొబైల్ ఫోన్లు అందజేస్తున్న చమర్తి జగన్మోహన్రాజు



అవగాహన సదస్సులో కళాశాల విద్యార్థులు

ఐబిఎం స్కిల్బిల్డ్పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పీలేరు:

పీలేరు ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐబిఎం స్కిల్ బిల్డ్పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆ కళాశాల చైర్మన్ ఎంపీ అవినాష్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం బెంగళూరుకు చెందిన 1ఎం1బి సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వెంకట బాలాజీ, యోగేశ్వర్ ఐబిఎం స్కిల్ బిల్డ్ కార్యక్రమం గురించి, దాని ద్వారా విద్యార్థులకు అందించే శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ టెక్నాలజీల ప్రాముఖ్యత గురించి కూలంకుషంగా చర్చించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎన్.వి.నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ నూతన టెక్నాలజీలు నేర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగ అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో ఈ నెల 21న జరగనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం పీలేరు తాలూకా అధ్యక్షులు వగళ్ళ చంద్రారెడ్డి, కార్యదర్శి ఎర్రమరాజు, కోశాధికారి పి.కృష్ణయ్య, సభ్యులు ఎన్.రాజారెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. 21న ఆదివారం స్థానిక ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక, సీనియర్ సిటిజన్ల సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. అనంతరం జరిగే సమావేశంలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న తమ ప్రధాన సమస్యలైన డిఎలు మంజూరు, నూతన పిఆర్సితో పాటు రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక బకాయిల మంజూరు, వంటి పలు సమస్యలపై చర్చిస్తామన్నారు. పింఛనుదారులందరూ సమయానికి కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వైఎస్ఆర్టియుసి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: జిల్లాలో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ బలోపేతానికి కార్మికులు కృషి చేయాలని వైఎస్ఆర్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న ఎల్లప్ప, కార్యదర్శి శంకరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్టియుసి జిల్లా స్థాయి నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ నిర్మాణానికి కార్మికులే బలమైన పట్టుకొమ్మలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ, మండల స్థాయిలలో ట్రేడ్ యూనియన్ నిర్మాణానికి, బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని కార్మికులు, ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి టెండర్లను పిలిచిన కూటమి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలంటే రాష్ట్రంలో ఉన్న అన్ని సంఘటిత, సంఘటిత రంగాల కార్మికులు సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. సమస్యలు పరిష్కారం కోసం కార్మికులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.

ఘనంగా జగన్ ముందస్తు జన్మదిన వేడుకలు: జగన్ ముందస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్చేసి పంచి పెట్టి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు బత్తల భక్తుడు, షబ్బీర్, మధుకర్రెడ్డి, రమణ, మహమ్మద్, షరీఫ్, గణేష్ నాయక్, చింటూ శశి, చరణ్ పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

మంచి నడవడికను అలవర్చుకోవాలి

- మదనపల్లె డిప్యూటీ డిఇఒ లోకేశ్వర్రెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలని మదనపల్లి ఉప విద్యాశాఖ అధికారి లోకేశ్వర్రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000లో చదువు పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు స్థానిక ఆర్ఎంఎం కింగ్ ప్యాలెస్లో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మనం ఇక్కడ కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పూర్వం గురువులు అంటే భయం, భక్తి ఉండేవని, ఇప్పటి పిల్లలు సమాజంలో పెరిగిన టెక్నాలజీ ద్వారా చెడు సావాసాలకు బానిసవుతున్నారన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, గురువులు, పెద్దల పట్ల గౌరవం నేర్పించాల్సిన బాధ్యత మన తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. తదనంతరం అప్పటి పూర్వ గురువులు రుద్రయ్య, ఓబుల్రెడ్డి, మురళీ, లోకేశ్వర్ రెడ్డి, శంకరలకు పూలమాలలు వేసి, దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుంధర, పూర్వ విద్యార్థులు జగదీష్, నాగ, రామిశెట్టి సునీల్, నవాజ్, యోగేశ్వర్ రెడ్డి, నరేష్, రాధాక్రిష్ణ, చిన్నరెడ్డెప్ప, నాగేంద్ర, రామక్రిష్ణ, రాజేష్, రమణ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మెప్మా కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు నిర్వహించిన శిబిరంలో 519 మంది పైగా మహిళలకు ఉచితంగా 16 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి.రవి మాట్లాడుతూ 30 సంవత్సరాల పైబడిన మహిళల్లో ఎంతో మందికి ఎన్నోరకాలు తెలియని జబ్బులు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇప్పుడు తిరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ఉచితంగా సఖి సురక్ష అనే కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచిత చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్త పోటు, మధుమేహం థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత పరీక్షలు, రక్తహీనత, విటమిన్ లోపం, పోషకాహార లోపాలతో పాటు మూడు రకాల కేన్సర్, నాలుగు రకాల మానసిక ఆరోగ్య సమస్యల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశామని పేర్కొన్నారు. ఈ పథకం కింద నిర్వహించే పరీక్షలు ప్రయివేట్ ఆస్పత్రిల్లోని ల్యాబ్ల్లో అయితే రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవడం ద్వారా లబ్ధి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సురేంద్ర, ఐబి నాగరాజు, మెప్మా మేనేజర్ అబ్బాస్ అలీఖాన్, మెప్మా సిబ్బంది, ఎస్ఎల్ఎఫ్ఆర్పిలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు వైద్య పరీక్షల గురించి వివరిస్తున్న డాక్టర్



సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ భావన

స్వామిత్వ సర్వేను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి- నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేని రాజంపేట సబ్ కలెక్టర్ భావన శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ కంఠంలోని ఇళ్లు, స్థలాలు పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కెఆర్ఎం ప్రసాద్, తహశీల్దార్ అమరేశ్వరి, డిప్యూటీ ఎంపిడిఒ మాల్యాద్రి, ఆర్ఐ సుశీల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తేజ, నాగలక్ష్మి, మనోజ్, పంచాయతీ సెక్రటరీ సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

ప్రజాశక్తి-కలికిరి : కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలో కె.రెడ్డివారిపల్లి సచివాలయంలో శనివారం జరిగే గ్రామసభలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని మేజర్ పంచాయతీ ఇఒ అశోక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు, స్వామిత్వ పథకంలో భాగంగా ఉదయం 10 గంటలకు సర్పంచ్ ఎల్లయ్య అధ్యక్షతన గ్రామసభ ప్రారంభమవుతుందనితెలిపారు. వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఎస్‌టియు రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా హైమావతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్త పేట మోడల్ ప్రైమరీ ఎస్‌టియు స్కూల్‌లో పిఎస్ ఎస్‌హెచ్‌ఎంగా పనిచేస్తున్న డాక్టర్ జిపి హైమావతినీ ఎస్‌టియు రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా రాష్ట్ర కమిటీ డాక్టర్ జిపి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమె మొదటి నుంచి ఎస్‌టి యు లోనే ఉంటూ అనేక కీలకమైన పదవులు చేపట్టారు. సామాజిక, సాంస్కృతిక, సాహిత్యం కార్యక్రమం లో పాల్గొని, సావిత్రబాయి పూలే, అవార్డు మదర్‌థెరిసా అవార్డు, దుర్గబాయి దేశముఖ్ అవార్డు, సాహిత్యం పరంగా గుర్రం జాషువా అవార్డు జాతీయ ఆదర్శ మహిళా రత్న అవార్డు, కవితహంసిని,సాహితీ సేవా తపస్విని, సాహితి కళాబందు అనేక పురస్కారాలు బిరుదు జాతీయ స్థాయి కవి సమ్మేళనం లో పాల్గొని అనేక సన్మానం లు పొందారు. రాష్ట్రకమిటీ గుర్తించి రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని ఎస్‌టియు మండల అధ్యక్షులు సయ్యద్ సత్తాజ్, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, ఆర్థిక కార్యదర్శి మలవతు శివరాం, ప్రసాద్ తెలిపారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కలకడ



ఇర్ఫాన్‌బాషా



రెడ్డెప్ప

మండల కేంద్రం కలకడలోని యుటిఎఫ్ జడ్‌పి హైస్కూల్‌లో మండల యుటిఎఫ్ నూతన కార్య వర్గానికి ఎన్ని కలు నిర్వహిం చారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోన ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు వై.రెడ్డప్ప, కార్యదర్శిగా ఎర్రకోటపల్లి పంచాయతీ సింగనొడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బి.ఇర్ఫాన్ బాష, సహాధ్యక్షుడిగా యం.కిరణ్ కుమార్, ట్రెజరర్‌గా యం.యల్.చలపతి, గౌరవ అధ్యక్షులుగా పి.శీను, జిల్లా కార్యదర్శిగా ఆర్ అష్రఫ్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.అక్రంబాష పర్యవేక్షించినట్లు తెలిపారు.



ద్వారకనాథ్‌రెడ్డి



ఫిరోజ్‌బాషా

తంబళ్లపల్లి: తంబళ్లపల్లి యుటిఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎ.ద్వారకనాథ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని గోపిదిన్నె ఉన్నత పాఠశాల ఆవరణలోయుటిఎఫ్ ఉపాధ్యక్షులు జైకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా ఫరోజ్ బాషా, కార్యదర్శులుగా సుజాత పి.రమణ రాయక్ ఆర్థిక కార్యదర్శిగా పి అనసూయమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం శంకర్,పీ షాదిక్ అలీఖాన్, కె.మేరీ, ఆర్.ఆంజనేయులు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



అబ్దుల్ రాఖిబ్



మల్లికార్జున

రాయచోటి టౌన్ : పట్టణ ంలోని అలీమాబాద్ జడ్‌పి ఉర్దూ పాఠశాలలో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటిఎఫ్ ఎన్నికల పరిశీలకుడు టి.శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్, జిల్లా కార్యదర్శులు రాజా రమేష్ చంద్రశేఖర్, షేక్ దావుద్దీన్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయించాలని 12వ పిఆర్‌సి కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ప్రస్తుత ప్రభుత్వ ఉపాధ్యాయ సమస్యల పట్ల చిన్న చూపు చూస్తుందన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ మండల అధ్యక్షుడిగా చవ్వాకుల మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా ఎస్ అబ్దుల్ రాఖిబ్, గౌరవ అధ్యక్షునిగా జి శ్రీనివాసులు, సహ అధ్యక్షుడిగా ఎల్ రామ్మోహన్ వి గౌసియా, ట్రెజరర్ గా మన్సూర్ అలీ, కౌన్సిలర్‌గా ఎం.నాసిర్‌ఖాన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నిక కాబడిన సభ్యులకు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి షేక్ జావీద్ పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞానాభివృద్ధి పొందాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన పెంచుకొని జ్ఞానాభివృద్ధి పొందాలని ఎంఇఒ చక్రధర్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంఇఒ ఆధ్వర్యంలో తుమ్మలబైలు అటవీ క్షేత్ర పర్యటన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన సమపార్జనలో క్షేత్రస్థాయి పర్యటనలు ఎంత అవసరమని పర్యావరణ విద్య కూడా విద్యార్థులకు ఎంతగానో అవసరమని తెలిపారు. పర్యావరణం మీద అవగాహన కలిగి ఉంటే కాలుష్యాన్ని అరికట్టడంలో అడవుల సంరక్షణలో ముందుంటారని పేర్కొన్నారు. సాయంత్రం రాజంపేట నగరవనంలో పర్యావరణం మీద చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. తుమ్మల బైలు అటవీ ప్రాంతం, రాజంపేట నగరవనం వీక్షించిన విద్యార్థులు ఎంతగానో సంతోషించారు. ఇంతటి మంచి అవకాశాన్ని కల్పించిన ఎఇఒకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దత్తాత్రేయ, ప్రధానోపాధ్యాయులు మురళీధర్, అలీఅక్బర్, ఉపాధ్యాయులు భారతి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, సుబ్బారెడ్డి, స్రవంతి, నరసింహులు, నాగరాజు, ఎంఐఎస్ శివ పాల్గొన్నారు.



పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

యుటిఎఫ్ జిల్లా మహాసభలకు తరలిరండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - మదనపల్లి టౌన్

ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణే లక్ష్యంగా, ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమమే దిశగా యుటిఎఫ్ అడుగులు వేస్తోందని జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు అన్నారు. ఆదివారం పీలేరులోని ఎస్‌వి ఎస్–ఎస్ కల్యాణ మండపంలో నిర్వహించనున్న జిల్లా యుటిఎఫ్ మహాసభలను ఘనంగా విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, ఉపాధ్యాయుల సంక్షేమానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఈ జిల్లా మహాసభలో విస్తృత చర్చలు, కీలక తీర్మానాలు ఉంటాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. నూతన పిఆర్‌సి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతిని ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, విజయ్‌కుమార్, డివిజన్ కన్వీనర్ ఎగవింటి సుధాకర్, సీనియర్ నాయకులు రవిప్రకాష్, ఉత్తన్న, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం, విజయ్, గజేంద్ర, వెంకటయ్య, రవీంద్ర, రమణారెడ్డి, మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

పీలేరు: పీలేరులో ఈనెల 21న జరగనున్న ఎపియుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పీలేరులో జరిగిన సమావేశంలోనాయకులు మాట్లాడుతూ స్థానిక ఎస్‌విఎస్ఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే 4వ కౌన్సిల్ సమావేశానికి మదనపల్లె, రాజంపేట, రాయచోటి, పీలేరు డివిజన్‌ల నుంచి అధిక సంఖ్యలో సభ్యులు హాజరై సమావేశాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు ఎస్. శివారెడ్డి, జిల్లా కోశాధికారి బి.చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శి అక్రంబాష, పీలేరు, కెవి పల్లి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర, విశ్వనాథరెడ్డి, జి. వెంకటరమణారెడ్డి, ఎస్. అఫ్రోజ్‌అలీ పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు

- ఎపిఐఐసి డైరెక్టర్ మైఫోర్స్ మహేష్

ప్రజాశక్తి - మదనపల్లె టౌన్

మదనపల్లి జిల్లా పారిశ్రామికవాడల అభివృద్ధి, అత్యున్నత స్థాయి మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని ఎపిఐఐసి డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ అన్నారు. శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎపిఐఐసి కడప, అన్నమయ్య జిల్లాల రీజనల్ మేనేజర్ శ్రీనివాస్‌మూర్తి, డిఇ కమలాకర్‌తో సమావేశమై మదనపల్లి జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో ఎదురవుతున్న సమస్యలు, కల్పించాల్సిన మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా మదనపల్లి– తంబళ్లపల్లి నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కులు, పీలేరు నియోజకవర్గంలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. ములకలదిన్నె ఆటోనగర్, వలసపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లలో జరుగుతున్న రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ నెల 29న జరగనున్న ఎపిఐఐసి 250వ బోర్డు సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై కూడా చర్చ జరిగిందన్నారు. ఆటోనగర్‌కు సంబంధించిన ప్లాట్లను అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయిం చాలని సూచించారు. తంబల్లపల్లి, మదనపల్లిలో ఏర్పాటు చేయబోయే ఎంఎస్ఎంఇ పార్కుల భూసేకరణను పూర్తిచేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. మదనపల్లి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇండస్ట్రియల్ పాలసీపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించి, మదనపల్లి జిల్లాను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మైఫోర్స్ మహేష్

నెట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు



జిల్లా స్థాయికి ఎంపికైన మహిళల జట్టు

ప్రజాశక్తి - మదనపల్లె టౌన్

యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసే దిశగా విశ్వం స్కూల్ సిబిఎస్ఇ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుందని విశ్వం విద్యాసంస్థల అధినేత ఎం.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పురుషులు, మహిళల నెట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపి కలు ఉత్సాహంగా నిర్వహించారని, జిల్లా జట్టు కోసం ప్రతిభావంతులైన నెట్‌బాల్ ఆటగాళ్లను గుర్తించడమే ఈ ఎంపికల ప్రధాన లక్ష్యమన్నారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విభాగానికి చెందిన విద్యార్థులు పోటీలో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ జిల్లా జట్టులో స్థానం కోసం పోటీ పడ్డారన్నారు. ఈ కార్యక్రమానికి నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ డి.శ్రీనివాసులు రెడ్డి హాజరై స్కూల్ క్యాంపస్‌లో ఉన్న క్రీడా ప్రోత్సాహక వాతావరణాన్ని ప్రశంసించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా పిఇటి, పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ రెడ్డి వరప్రసాద్ క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపల్ రోజ్లిన్ ప్రియా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి జీవితంలో ఆటలు ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనని ఆమె అభినందించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు 'ఆదిత్య' విద్యార్థి

మదనపల్లె టౌన్ : విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుకుంటూ ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ప్రశాంత్ మరో ఘనతను సాధించాడని ఆకళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కళాశాలకు చెందిన జి.ప్రశాంత్ జెఎన్‌టియుఎ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. కుప్పంలో నిర్వహించిన ఎంపికలలో ప్రశాంత్ తన ప్రతిభను నిరూపించి ఈ ఘనతను సాధించాడన్నారు. ఈ విజయం కళాశాలకు గర్వ కారణంగా నిలిచిందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాం క్షించారు. కళాశాల చైర్మన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగమల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు విద్యార్థిని అభినందిస్తూ క్రీడల్లోనూ చదువుల్లోనూ సమతూకంగా ముందుకు సాగాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు ప్రశాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రశాంత్‌తో కళాశాల అధ్యాపకులు



సుండుపల్లి : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హుస్సేన్

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ హుస్సేన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రాయవరం గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు, నాటుసారా, సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై కలిగే అనర్థాలపై వివరించి చెప్పారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు గంజాయికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు గుర్తించి పిల్లలను సరైన మార్గంలో ఉంచేలాగా చర్యలు చేపట్టాలని కోరారు. శక్తి యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్ల వల్ల జాగ్రత్తగా ఉండాలని సైబర్ నేరగాళ్లు లైవ్ కాల్స్ అంటూ ఫోన్ చేసి మీ బ్యాంకు ఖాతాలో లూటీ చేస్తారని, దొంగతనాలుగు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రజలకు తెలియజేశారు. **చిట్వేలి :** విద్యార్థి దశ నుండే మహిళల చట్టాలపై బాలికల వేధింపులపై బాల్య వివా హాలపై అవగాహన అవసరమని. చిట్వేలి ఎస్సై వినోద్ కుమార్ వెల్లడించారు. మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాల ప్రిన్సిపల్ తులసి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ శక్తి యాప్ మహిళలకు వరమన్నారు. నిర్భయంగా సంబంధిత విషయాలను ప్రతి ఒక్క విద్యార్థిని వారి కుటుంబంలో మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. చట్టాలపై మహిళలకు విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు.కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండా లని సిఐ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాల, జూని యర్ కళాశాలలో విద్యార్థులకు రాజంపేట సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం పైన, లైంగిక వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం కోసం డయల్ 112,శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు.

నూతన కానిస్టేబుళ్లకు సన్మానం

ప్రజాశక్తి-చిట్వేలి

ఇటీవల జరిగిన పోలీస్ నియామకాలలో మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కొత్తగా కానిస్టేబుళ్లకు ఎంపికై శిక్షణకు వెళుతున్న వారిని స్థానిక ఎస్ఐ వినోద్‌కుమార్ శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో సన్మానిం చారు. ఈనెల 22 నుండి తిరుపతిలో శిక్షణ ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం సంపాదించడం అదృష్టమని, లా అండ్ ఆర్డర్‌ను అనుసరిస్తూ సమాజంలో అవినీతిని అరికట్టి ప్రజలకు సేవ చేయడం ఏ కొంతమందికి మాత్రమే దక్కుతుందన్నారు. ఏదేమైనప్పటికీ శిక్షణ పూర్తి చేసుకొని పోలీస్ శాఖలో సమాజానికి మంచి సేవ అందించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ భాషా వికాసానికి శ్రీకారం హర్షణీయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ నూతన చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షిబ్లి ఆధ్వర్యంలో ఉర్దూభాష విద్యా సాహిత్య, సాంస్కృతిక వికాసానికి శ్రీకారం చుట్టినట్లు జాతీయ ఉర్దూ ఉత్తమ అవార్డు గ్రహీత, జడ్‌పి ఉర్దూ హైస్కూల్ ఉర్దూ ఉపాధ్యాయులు టి.అబ్దుల్‌నాదిర్షావలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ అర్థ శతాబ్ది ఉత్సవాల 'సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్'ను పురస్కరించుకొని ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముస్లిం మైనారిటీలో ఉత్సాహం, ఉత్తేజం నింపేందుకు ర్యాలీలు ఆటల పోటీలు, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు, కాలిగ్రాఫీ పోటీలు, జాతీయస్థాయి ఉర్దూకవి సమ్మేళనం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నిమ్మనపల్లిలో వందమంది ఉర్దూ పాఠశాల విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఉర్దూ భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఉర్దూ భాషకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని కోరారు.



విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న నాదిర్షా వలి



బోరుకు మరమ్మతు చేపిస్తున్న సర్పంచ్

తాగునీటి బోరుకు మరమ్మతు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీ వడ్డేపల్లిలో ప్రజలకు తాగునీరు అందించే ప్రధాన బోరు మరమ్మతుకు రావడంతో గ్రామ ప్రజలు సర్పంచ్ నాగార్జునసాగర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు.గ్రామంలో ఏ సమస్యలైనా ఉన్నాయా అని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు.వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో సుబ్బన్న, సీతారామయ్య, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా అష్ఫాఖుల్లాఖాన్ వర్ధంతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భారత స్వాతంత్ర సంగ్రామంలో మొట్టమొదటిసారిగా ఉరి కంబమెక్కిన వీరుడు అష్ఫాఖుల్లా ఖాన్ 98వ వర్ధంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అల్‌ఎ హసాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జ్యోతిచౌక్‌లో అష్ఫాఖుల్లా ఖాన్, రాజేంద్ర లాహిరి, రాంప్రసాద్ బిస్మిల్, రోషన్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ నాయకులు ఎల్.హసేన్ ఖాన్,సిపిఐ నాయకులు ఎస్.బషీర్ ఖాన్, ఎస్.మనోహర్ రెడ్డి, విద్యార్థి యువ నాయకులు గంగరాజు మాట్లాడుతూ అష్ఫాఖుల్లా ఖాన్ విద్యార్థి దశనుండే దేశభక్తి, జాతీయ భావాలు అలవర్చుకున్నారని పేర్కొన్నారు. మితిమీరిపోతున్న ఆంగ్లేయుల ఆగడాల వల్ల వలస పాలకులపై తీవ్ర విముఖతను పెంచుకొని,రాంప్రసాద్ బిస్మిల్ నాయకత్వంలో స్థాపించిన హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసి యేషన్‌లో చేరి,ఆయనకు ప్రాణ స్నేహితుడుగా మారాడని, దేశంలోని ముస్లిం యువ కులలో దేశభక్తి భావాలు పెంపొం దించడంలో ఎంతగానో కృషి చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో రఫీ,బాస్ నాయకులు సింగన్న,సచిన్, అయూబ్ ఖాన్ ,కాలేషా, విద్యార్థి నాయకులు గంగారాజ్ ,కార్మిక నాయకులు సలీం భాషా పాల్గొన్నారు.

మల్లయ్య కొండలో మైనింగ్ సర్వే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : తంబళ్లపల్లెకు సమీపంలోనిమల్లయ్య కొండ, సాదుకొండ అటవీ సముదాయల్లో మైనింగ్ సర్వే కలకలం రేపింది. రెండు రోజులుగా కర్ణాటకకు చెందిన ఓ మైనింగ్ కంపెనీ జియాలజిస్టులు సాదుకొండ అటవీ ప్రాంతంలో అనుమానస్పదంగా సంచరిస్తుండడంతో పరిసర గ్రామాల ప్రజలు నీలదీసి అటవీ శాఖ అధికారులకు సమా చారం ఇచ్చారు. ఎఫ్‌బిఒ రామరాజు వెంటనే వెళ్లి అటవీశాఖ ఉన్నతధికారుల అనుమతి లేనిదే అడవిలో సర్వే చేపట్టరాదని వారిని పంపివేశారు.

పరిసరాల శుభ్రతే ప్రధాన లక్ష్యం : ఇఒ

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి మేజర్ పంచాయతీలో పరిసరాలుశుభ్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఇఒ జి.అశోక్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలికిరి క్రాస్ రోడ్డు, మదనపల్లి రోడ్డులోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్ల పొదలను జెసిపి సహాయంతో తొలగించి మట్టి పోసి చదును చేయించారు. పంచాయతీ సిబ్బంది సహా యంతో రోడ్డుపై వున్న చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపట్టణంలో ఎప్పటికప్పుడు మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం, రోడ్లపై చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయడం, పట్టణంలోని ప్రజలందరికీ మెరుగైన మౌలిక వసతులు కల్పిం చడం, ప్రజలకు తమ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడం తద్వారా కనిగిరి మేజర్ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే కర్తవ్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ పంచాయతీ సిబ్బందికి సహకరించి ఏవైనా సమస్యలు ఉంటే ఫోన్ ద్వారా కానీ, నేరుగా పంచాయతీ కార్యాలయంలో తెలపాలన్నారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



పంచాయతీ సిబ్బంది ద్వారా రోడ్లపై చెత్తను శుభ్రం చేయిస్తున్న ఇఒ అశోక్

క్రైం కార్నర్

టివి పేలి వృద్ధురాలికి తీవ్ర గాయాలు

- ఇంటిలో సామగ్రి దగ్ధం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వలచెరువులో ఓ ఇంటిలో టివి పేలి వృద్ధురాలికి తీవ్రంగా గాయపడింది. ఇంటిలోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. బాధితుల వివరాల మేరకు.. గువ్వలచెరువుకు చెందిన గూడూరు లక్ష్మమమ్మ, ఆమె కోడలు నగరత్న నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి టివి చూస్తూ అత్తా కోడలు నిద్రపోయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ముందు ముగ్గు వేయుటకు కోడలు నాగరత్నమ్మ నిద్ర లేచి బయట ముగ్గ వేస్తు ఉండగా ఒకసారిగా టివి పేలి ఇంట్లో నిద్రిస్తున్న లక్ష్మమ మ్మకు తీవ్ర గాయాలు కాగా ఇంట్లో సామగ్రి అంతా కలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి లక్కిరెడ్డిపల్లి సిఐ కృష్ణంరాజు నాయక్ వెళ్లి పరిశీలించారు. గాయపడిన లక్ష్మమమ్మను చికిత్స నిమిత్తమై స్థానికల సహకారంతో 108 వాహనం ద్వారా కడప రిమ్స్ తరలించారు. విఆర్ఒ రాధిక వెళ్లి ప్రమాద వివరాలను తహశీల్దార్‌కు అందించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడికి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిలో డెకరేషన్ వేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన సంఘటన పట్టణంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు..మండలంలోని చీకిలబైలుకు చెందిన రామకృష్ణ కుమారుడు కరుణాకర్ శానిటోరియంలో ఉన్న సెంట్ లూక్ చర్చికి డెకరేషన్ వేసేందుకు వెళ్లాడు. బల్బు అమర్చుతున్న సమ యంలో వైర్లను ఓ పక్క నుంచి మరో పక్కకు లాగే క్రమంలో విసిరి వేశాడు. ఆ వైర్లు పక్కనే ఉన్న 11 కేవి వైర్లమీద పడడంతో కరుణాకర్ కరెంటు షాక్ కు గురై తీవ్రంగా గాయ పడ్డాడు. స్థానికులు వెంటనే బాధితున్ని ఆటో లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. న్యాయమూర్తి ఆస్పత్రికి చేరుకుని బాధితుని వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భవన నిర్మాణ పనులు చేస్తున్న భవన కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లి మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని విజయనగర్ కాలనీ చెందిన వీరభద్ర భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాబుకాలనీలో ఓ ఇంటి నిర్మాణ పనికి వెళ్ళాడు. పనులు చేస్తుండగా సారవకట్టెలు జార డంతో పైనుంచి కింద పడి పడిపోయాడు. అతని తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బాధితుడిని స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు.